
క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆర్యవైశ్య సంఘం వారు వ్యవహరించారు. హనుమజ్జయంతి తర్వాత వచ్చే ప్రతి మంగళవారం రోజున సామాజికవర్గాల వారీగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ నిర్వహించారు. రాత్రి అత్యంత వైభవంగా గ్రామోత్సవం జరిగింది.

వచ్చే నెల 2న ధర్నా



పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

ముత్తుకూరు(పొదలకూరు): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో తీవ్రంగా వైఫల్యం చెందిన నేపథ్యంలో సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన అన్ని మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్ తెలిపారు. ముత్తుకూరు పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు ఉపయోగపడే ఒక్క పథకం కూడా అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల కంటే మెరుగ్గా ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు.

జర్నలిస్టులపై కక్ష సాధింపు తగదు



జేసీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెలూరు రూరల్: కావలిలో జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులపై విచారణ జరిపి న్యాయం చేయాలని జర్నలిస్ట్ జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు జేసీ కార్తీక్‌కు కలెక్టరేట్లో వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. జిల్లాలో జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు పెరిగిపోతున్నాయని చెప్పారు. కావలిలో 2020లో అమృత్ పైలాన్ ధ్వంస కేసును తెరిచి, ఘటనతో సంబంధం లేని ఏడుగురు జర్నలిస్టులపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వారిలో నలుగుర్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారన్నారు. ఈ వ్యవస్థపై దాడులు, దౌర్జన్యాలు చేయడం బాధాకరమని చెప్పారు. జేఏసీ నేతలు జయరాజ్, మస్తాన్‌రెడ్డి, కృష్ణ, డేవిడ్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాన్ని కాపాడిన స్థానికులు



సంగం: మురుగు కాలువలో పడిన మూగజీవాన్ని స్థానికులు బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన మండల కేంద్రమైన సంగంలో మంగళవారం చోటుచేసుకుంది. బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఓ డ్రైనేజీ కాలువలో ప్రమాదవశాత్తు ఓ గేదె పడిపోయింది. పెద్దగా అరుస్తుండడంతో స్థానికులు గుర్తించి జేసీబీ సాయంతో ఆ గేదెను బయటకు తీశారు. మురుగును తొలగించేందుకు తీసిన రాళ్లను అలాగే వదిలేయడంతో ఇలా గేదె పడిపోయిందని, అధికారులు స్పందించి కాలువపై మూతలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కావలి డిపోకు రాష్ట్ర స్థాయి అవార్డు

కావలి(జలదంకి): కావలి డిపోకు రాష్ట్రస్థాయి ఇందన సామర్థ్య అవార్డు వరించింది. దీనిని కావలి డిపో గ్యారేజ్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు కావలి డీఎం రాపూరు శ్రీనివాసులుకు మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా మురళీబాబు మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గానూ కావలి డిపోకు నిర్దేశించిన ఇంధన పొదుపు లక్ష్యాన్ని సాధించి అవార్డును అందుకుందన్నారు. ఈ అవార్డు సాధనలో డిపో మేనేజర్, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ కల్పన, ట్రాఫిక్, గ్యారెజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘమిత్రలో అంతా గందరగోళం

- నిత్యం ఒకరిపై ఒకరు ఫిర్యాదులు
- టీడీపీ నేతల్లా వ్యవహరిస్తున్న కొందరు సీసీలు
- తమకు నచ్చిన వ్యక్తులకే రుణాల మంజూరు
- ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసులు పెడతామంటూ బెదిరింపులు
- విడవలూరులో ఇదీ తీరు..



విడవలూరు సంఘమిత్ర కార్యాలయం

విడవలూరు: స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో వ్యవహారాలు రోజురోజుకూ గందరగోళంగా మారుతున్నాయి. పరస్పర ఫిర్యాదులు చేసుకుంటుండటంతో అధికారులకు, పొదుపు సంఘాల మహిళలకు మధ్య సమన్వయ లోపం ఏర్పడుతోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు సీసీలు పసుపు కండువాలు కప్పుకొని టీడీపీ నేతల్లా చెలామణి అవుతూ, పొదుపు సంఘాల మహిళలతో పాటు కొందరు వీఓఏలపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

దుర్భాషలు.. ఫిర్యాదులు

విడవలూరులో విధులు నిర్వర్తిస్తున్న వీఓఏను కొందరు సీసీలు, స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కార్యాలయంలోనే పలుమార్లు ఆమెను దుర్భాషలాడుతూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి తోడు పొదుపు రుణాలను సైతం తమకు నచ్చిన వారికే మంజూరు చేస్తున్నారు. ప్రశ్నించిన వారిని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పార్లపల్లికి చెందిన కృష్ణవేణి ఓ పొదుపు గ్రూపులో సభ్యురాలిగా పదేళ్లుగా ఉన్నారు. వీరు తీసుకున్న రుణం తీరిపోవడంతో కొద్దిరోజుల క్రితం తాజాగా మరోసారి మంజూరైంది. గ్రూపులో ఉన్న తొమ్మిది మందికి జమచేసి, తన ఖాతాలో వేయకపోవడంతో వీఓఏను ఆమె ప్రశ్నించారు. మీ గ్రూపునకు సంబంధించిన ఎలాంటి తీర్మానాన్ని తాను రాయలేదని, ఖాతాలో డబ్బులెలా జమయ్యాయో తెలియదని చెప్పారు. ఇదే విషయమై విడవలూరు సీసీ వెంకటేశ్వర్లును ప్రశ్నించగా, నువ్వు పొదుపు గ్రూపులో లేవని, తొలగించామంటూ ఆయన సమాధానమిచ్చారు. ఇక చేసేదేమీ లేక నెల్లూరులో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికను ఆమె ఆశ్రయించారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆయన, తనపైనే ఫిర్యాదు చేస్తావా.. నీ సంగతి చూస్తా.. అట్రాసిటీ కేసు నమోదు చేస్తానంటూ బెదిరించిన ఆడియోలు ప్రస్తుతం విడవలూరు వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. గతంలోనూ సదరు సీసీ.. విడవలూరు పొదుపు కార్యాలయానికి చెందిన వాట్సాప్ గ్రూపుల్లో గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేతను చేర్చారు. అయితే సంఘమిత్ర కార్యాలయానికి సంబంధించిన అంశాలను గోప్యంగా ఉంచాల్సింది పోయి, టీడీపీ నేతలకు చేర్చడమేమిటంటూ ఈయన్ను బదిలీ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరోసారి విడవలూరుకు డ్యూటీ వేయించుకోవడంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా కక్షపూరితంగా వ్యవహరించే వారిపై అధికారులు ఎలా వ్యవహరిస్తారో చూడాల్సి ఉంది.

కాకాణి కుటుంబానికి అండగా వైఎస్సార్‌సీపీ



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని కాకాణి నివాసంలో వారి కుటుంబసభ్యులను మంగళవారం కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. కాకాణిపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసు నిలవదని, కడిగిన ముత్యంలా బయటకొస్తారని చెప్పారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, 3, 4, 5, 11వ డివిజన్ల ఇన్‌చార్జిలు నారాయణరెడ్డి, సందానీ, సుబ్బారెడ్డి, మహేష్‌యాదవ్, నేతలు కృష్ణారెడ్డి, హరిబాబు, సింగంశెట్టి అశోక్, కొండయ్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న అరుణమ్మ, విజయకుమార్‌రెడ్డి

- నెల్లూరు సిటీ: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబీకులను వారి నివాసంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

మనుబోలు: మోటార్‌బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద మంగళవారం జరిగింది. స్థానిక అరుంధతివాడకు చెందిన చిన్నయ్య పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్నాడు. నెల్లూరు నుంచి గూడూరు వైపు వస్తున్న బైక్ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నయ్యను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న చిన్నయ్య

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

మనుబోలు: కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సర్వేపల్లి నియోజకవర్గ కన్వీనర్ గుంజి రమేష్ అన్నారు. మంగళవారం ఆయన మనుబోలులో మాట్లాడుతూ ప్రశ్నించే గొంతును అణిచివేయాలని ప్రభుత్వంలో ప్రయత్నిస్తోందన్నారు. కుట్రలో భాగంగానే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ జరిగిందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న కూటమి పాలన రాష్ట్రానికి పెనుముప్పుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై ముగ్గురు దాడికి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టకు చెందిన షిప్ మెకానిక్ ఇంతియాజ్ తన బాబాయి నిస్సార్ ఇంటికి బైక్‌పై ఆదివారం బయల్దేరారు. చిన్నా సైకిల్ షాపు వద్దకొచ్చేసరికి బైక్ అదుపు తప్పి పార్క్ చేసిన బైక్‌పై పడ్డారు. దీంతో కళ్లు కనిపించలేదా అంటూ అక్కడున్న మైజుల్లాఖాన్ నానా బూతులు తిట్టి ఇంతియాజ్‌పై దాడి చేశారు. ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించగా, మైజుల్లాఖాన్ అల్లుడు, దుకాణంలో పనిచేస్తున్న మరో వ్యక్తి ఇనుప రాడ్‌తో దాడి చేశారు. గాయపడిన ఆయన జీజీహెచ్‌లో చికిత్స పొందారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై అబ్దుల్ రజాక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు నుంచి యోగా కార్యక్రమాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని సంఘమిత్ర విద్యాలయంలో ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమాన్ని ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూన్ నాలుగు నుంచి పదో తేదీ వరకు నిర్వహించనున్నారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాచీన యోగాశాస్త్రాల మేరకు ఇన్నర్ ఇంజినీరింగ్ మనిషి సంపూర్ణ శ్రేయస్సుకు బాటలేసి ఆనందకరమైన జీవితానికి దోహదపడుతుందని చెప్పారు. ఆదివారం మినహా అన్ని రోజుల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని వివరించారు. ఆసక్తి గల వారు వివరాలకు 76618 08710, 81796 71988 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న సీపీఎం సమైక్యత యాత్రలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు, రామకోటయ్యనగర్, కొత్తూరు, సుందరయ్యకాలనీ, వనంతోపు, కొండాయపాళెం గేట్ సెంటర్లలో సీపీఎం సమైక్యత యాత్రలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉగ్రవాద దాడులపై బీజేపీ ఎంపీలు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమని చెప్పారు. నేతలు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, శ్రీనివాసులు, కొండా ప్రసాద్, కట్టా పెంచలనరసయ్య, నాగేశ్వరరెడ్డి, సుధాకర్, షాహినాబేగం, శ్రీనివాసులు, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా చెల్లాయపాళెం రోడ్డు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెం రోడ్డు అధ్వానంగా మారింది. ఫలితంగా రాకపోకలను సాగించాలంటేనే గ్రామస్తులు హడలిపోతున్నారు. రోడ్డంతా గుంతలమయం కావడంతో ప్రయాణం నరకంగా మారింది. గ్రామంలో దాదాపు 350 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. నిత్యం ఏదో ఒక పనిపై బుచ్చిరెడ్డిపాళెం వెళ్తుంటారు. రోడ్డు అధ్వానంగా మారిన తరుణంలో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోననే ఆందోళనకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అందుబాటులో ఆయుర్వేద వైద్యం

పొదలకూరు: మండలంలోని విరువూరు గ్రామంలో ఆయుర్వేద వైద్యం అందుబాటులో ఉంది. ఇక్కడ డాక్టర్ వినోద్‌బాబు రెగ్యులర్ వైద్యాధికారిగా కొనసాగుతున్నారు. అల్లోపతి మందుల వల్ల ఇతర జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని భావిస్తున్న వారు ఆయుర్వేద వైద్యం వైపు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో విరువూరు ఆయుర్వేద వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. నిత్యం 20 నుంచి 30 మంది వివిధ గ్రామాల నుంచి వైద్య పరీక్షల కోసం వస్తున్నట్టు వైద్యాధికారి వెల్లడించారు. దీర్ఘకాలిక జబ్బులు సైతం కొన్నినెలలపాటు మందులు వాడితే తగ్గుతున్నట్టు తెలిపారు. ఇక్కడ ప్రధానంగా బీపీ, షుగర్ వ్యాధులకు ఆయుర్వేద మందులను అందజేస్తున్నారు. వృద్ధులు అధిక సంఖ్యలో వస్తున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



యోగాపై విద్యార్థులకు శిక్షణ



క్విజ్ పోటీలు

కొడవలూరు: యోగా సాధనతో బహుళ ప్రయోజనాలున్నాయని విశ్రాంత ఉపాధ్యాయుడు కట్టా ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా యల్లాయపాళెంలోని గ్రంథాలయంలో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను వచ్చే నెల ఆరున అందజేయనున్నామని లైబ్రేరియన్ రాజేశ్వరి తెలిపారు.

యోగాపై అవగాహన



పొదలకూరు: యోగాంధ్ర ర్యాలీ

పొదలకూరు: యోగాంధ్రలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని యోగా గురువులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ డీవీ నరసింహులు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో శిక్షకులు దానిని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో విరువూరు ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి పంచాయతీ లింగంగుంటలో విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకుడు ఆనంద్‌రెడ్డి పలు అంశాలను వివరించారు. యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- మనుబోలు: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని బండేపల్లి గ్రామంలో మంగళవారం యోగా ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. అనంతరం యువతతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకుడు చెలికం కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో రోజు కొంతసేపు యోగా, ధ్యానం చేస్తే మంచిదన్నారు.
- ముత్తుకూరు(పొదలకూరు): యోగాంధ్రలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగా ట్రెయినర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ముత్తుకూరులో..



వెంకటాచలం: అవగాహన కల్పిస్తున్న ఆనంద్‌రెడ్డి



మనుబోలు: యోగాసనాలు వేస్తూ..

ఇనుప చక్రాల కింద నలుగుతున్న రోడ్లు

పొదలకూరు: రూ.కోట్లు వెచ్చించి రహదారుల నిర్మాణం జరుగుతున్నా వాటిని కాపాడుకోవడంలో కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బాధ్యత లేకుండా ఇనుప చక్రాలు, ట్రాక్టర్లను తిప్పుతుండటంతో అవి ఛిద్రమవుతున్నాయి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై), నాబార్డు నిధులతో నిర్మించిన రోడ్లు పాడవుతున్నాయి. కొందరు రైతులు పొలాల్లో దమ్ము కోసం అకు తొక్కే ఇనుప చక్రాలను గ్రామీణ రోడ్లపై లాక్కెళ్లడంతో దెబ్బతింటున్నాయి. అంతేకాక రహదారులను ఎక్కడపడితే అక్కడ అడ్డంగా తవ్వేయడంతో గుంతలు ఏర్పడుతున్నాయి.



దెబ్బతిన్న తారురోడ్డు

జీవనోపాధి మెరుగునకు కృషి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మెప్మా ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టి జీవనోపాధులు మెరుగునకు కృషి చేయాలని డీఆర్పీఏ ఐబీ అంకయ్య పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణ సమాఖ్య సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలు పొందిన వారు ఏదో ఒక యూనిట్‌ను తప్పక ఏర్పాటు చేయాలని సూచించారు. తృప్తి క్యాంటీన్, అరకు కాఫీ తదితరాలను అభివృద్ధి చేయాలని కోరారు. సీఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.



పట్టణ సమాఖ్య సభ్యులతో సమావేశం

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ఇందుకూరుపేట: ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ అనూష కోరారు. మండలంలోని గంగపట్నంలో చేపట్టిన రీ సర్వేను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పొలాలకు సంబంధించి తప్పులుంటే సవరించుకోవాలని, దీనికి గానూ పత్రాలను అధికారులకు అందించాలని కోరారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, డీటీ శివకుమార్, మండల సర్వేయర్ హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అనూష

మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం



నెల్లూరు(బృందావనం): వివాహ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు న్యూ సమైక్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేయాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసగిరి పట్టాభిరామయ్య కోరారు. అసోసియేషన్ జిల్లా స్థాయి ఆత్మీయ సమావేశాన్ని శోధన్‌నగర్‌లో జిల్లా అధ్యక్షుడు గున్నం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 250 మందికిపైగా మ్యారేజ్ మీడియేటర్లకు గుర్తింపు కార్డులను అందజేశారు. నిర్వాహకులు కొండూరు హరినారాయణరెడ్డి, నారాయణ, సరళ, సుబ్రహ్మణ్యం, గుంటూరు కృష్ణప్రియ, వెంకటాద్రి, మాకాని రమేష్, లక్ష్మీదేవి, ప్రియదర్శిని, హైమావతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.